

# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు

## శ్యామలాదేవి దశిక



అమెరికా ఐనా, అమలాపురమైనా ఇల్లాలు..ఇల్లాలే. ముచ్చట్లు ముచ్చట్లే..

ఓ అమెరికా ఇల్లాలు నెల నెలా మీతో పంచుకుంటున్న ముచ్చట్ల మురిపాలు..!

# కష్టాలు

అసలు నాకు అప్పుడప్పుడూ పెద్ద అనుమానం వస్తుంది. జనాలందరూ వున్నచోట వుండకుండా ఇలా కుటుంబాల్ని పెళ్ళగించుకొని ఎక్కడెక్కడికో వెళ్ళిపోవటంలో అర్ధమూ పరమార్ధము ఏమిటా అని?

ఏముందీ--- అక్కడుండే కష్టాల్ని తప్పించుకోడానికి, వేరే చోట సుఖంగా బతకటానికీ అంటారా?

ఏమోనండి, ఈ విషయంలో నా బుర్ర ఎప్పుడూ తికమక పడుతూ వుంటుంది..నాకు తెలీక అడుగుతా, మనం వున్న చోటునుంచి ఇంకో చోటుకు వెళ్ళినంత మాత్రాన కష్టాలు పోతాయటండీ మన పిచ్చి కాకపోతే !

రాత్రి వండిన అన్నం మిగిలితే మర్నాడు పులిహోర చేసుకుని తిన్నట్టు, కష్టాల రూపం మారుతుందే కాని అవెక్కడికీ పోవు.

మనల్నే చూడండి. ఇక్కడికి రాకముందు మనం ఇండియాలో వున్నప్పుడు మీరు ఏమనేవారో గుర్తుందా?

మన దేశంలో అవినీతి ఎక్కువ, ఇలాంటి చోట్ల మనకు మంచి ఉద్యోగాలు రావడం కష్టం, వచ్చినా అందులో నిలబడలేము అనే వారు.

అమెరికా వచ్చాక మనకు మంచి ఉద్యోగాలు వచ్చిన మాట నిజమే ! కానీ ఏ ఉద్యోగంలోనైనా ఎన్నాళ్ళుంటామో మనకే తెలీదు. ఇది మనిద్దరికీ అనుభవమే !

ఎప్పుడు ఎవరు డౌన్ సైజ్ చేస్తారో, ఏ టైములో మేనేజ్ మెంట్ మారుతుందో ఆ దేముడికే ఎరుక.

ఏ క్షణంలో ఉద్యోగాలు ఊడతాయో అని అనుక్షణం భయమే కదా?

అక్కడుంటే జన్మంతా అద్దెకొంపలో బతకాల్సిందే అని వాపోయారు. అమెరికా వచ్చామని బోలెడంత అప్పుచేసి ఇల్లు కొన్నారు. ఈ ఇంటికి మార్టిగేజ్ కట్టలేక మీపని, చాకిరి చెయ్యలేక నాపని అవుతున్నది ఇప్పుడు !

అసలే నేను అనారోగ్యం మనిషిని. పేరుకు ఇంట్లో ముగ్గురు పిల్లలు వున్నా ఒక్కరూ ఇక్కడి ప్లేటు తీసి అక్కడ పెట్టరు. వాళ్ళలోకమే వాళ్ళది. ఇల్లు కొనగానే పిల్లలకు తలా ఒక రూము ఇచ్చి మురిసిపోయారు ! ఇప్పుడు వాళ్ళు ఆ రూముల్లోంచి బయటకు రారని బాధ పడుతూ వుంటారు.

ఇండియాలోనే వుంటే పిల్లలకు మంచి చదువులు చెప్పించలేమని, వాళ్ళకు మంచి భవిష్యత్తు వుండదని అనేవారు. ఇప్పుడు పిల్లలకు మంచి చదువులు చెప్పించే స్థోమత మనకు వుంది. వాళ్ళకు వాళ్ళ భవిష్యత్తును తీర్చి దిద్దుకునే గొప్ప అవకాశాలు వున్నాయి. అయినా పిల్లలు 'మీరు చదవమనే చదువులు మాకు ఇష్టం లేదు. మా భవిష్యత్తు ఏదో మేము చూసుకుంటాం, ఇందులో మీ ప్రమేయం అనవసరం' అని గంటా పథంగా చెప్పారు !

పెద్దవాడు హైస్కూలు అవడంతోటే 'ఐ నీడ్ ఎ బ్రేక్' అంటూ చదువుకు సున్నా చుట్టాడు. అమ్మాయి రెండేళ్ళు కాలేజీ చదువు వెలగబెట్టి, మనకు చెప్పాపెట్టకుండా అర్ధాంతరంగా ఆపేసి ఉద్యోగంలో చేరింది. ఇక చివరివాడు ఎప్పుడు చూసినా మ్యూజిక్ అంటూ ఆ బ్యాండు వాళ్ళతో తిరుగుతూ వుంటాడు. ఏవన్నా అంటే మ్యూజిక్కే నా ప్రాణం అంటాడు. ఇంక వీడేం ఒరగపెడతాడో చూడాలి. ఆ సంగీతంతో ఎలా బతుకుతాడో వాడికే తెలియాలి !

వయసు పై బడుతున్న కొద్దీ తుమ్మితే వూడిపోయే ఈ ఉద్యోగాలతో ముందు ముందు ఎలా అని భయం. ఎప్పుడు పడితే అప్పుడు బయటకు వెళ్ళే ఈ పిల్లలు క్షేమంగా ఇంటికి వస్తారోలేదో అని ఆందోళన. చదువుల మాట అటుంచి వీళ్ళు ఎవళ్ళతో స్నేహాలు చేస్తున్నారో, ఎటువంటి దోవలు తొక్కుతారో అని అదో హడలు. అన్నింటికి "వుయ్ నో వాట్ వుయ్ అర్ డూయింగ్" అనే ఈ పిల్లలు ఎప్పటికైనా పెళ్ళిళ్ళు చేసుకుని లైఫ్‌లో స్థిరపడగలరో లేదో అని దిగులు.

అనారోగ్యంతో మంచమెక్కితే నా సంగతి ఏమిటా అని అదో వర్రి. నాకేమైనా అయితే మీరేమైపోతారో అని గుబులు.

ఇలా భవసాగరాలు ఎన్నెన్నో-----

అందుకే, నాకనిపిస్తుంది, కష్టాలు తప్పించుకోవాలని మనం ఎంతదూరం వచ్చినా మనం వున్నంతకాలం అవి మన వెన్నంటే వస్తాయండీ. కాకపోతే డిఫరెంటు కష్టాలు--డిఫరెంటు లొకేషను. అంతే తేడా !